## మద్యం అక్రమ విక్రేతలపై కేసులు

కారేపల్లి, అక్టోబర్ 27: మండలంలోని ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ దేవాలయ సమీపంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ముగ్గురిపై శుక్రవారం కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఝులీఫికర్ అహ్మద్ తెలిపారు. ఈ గ్రామస్తులు హాతీరాం, మున్న, రత్న కలిసి మద్యం బాటిళ్లను జాతరలో అమ్ముతుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 107 బాటిళ్లను స్వాధీనపర్చుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బెల్ట్ దుకాణాల్లో మద్యం దొరికితే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ హెచ్చరించారు.

## కారు గెలవాలి.. సారు రావాలి..



సోమన్న బృందం ప్రదర్శన

కూసుమంచి రూరల్, అక్టోబర్ 27: 'కారే గెలవాలి.. మళ్లీ సారే రావాలి..' ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న బృంద సభ్యులు ఆలపించిన పాటలు, ప్రదర్శించిన నృత్యాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలరించాయి. మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో శుక్రవారం సీఎం సభా వేదికపై వారు తెలంగాణ ధూంధాం కార్యక్రమం నిర్వహించారు. 'బంగారు తెలంగాణకు రాచబాటు వేసిండు మన కేసీఆర్.., గులాబీల జెండలమ్మ రామక్క, కారు గుర్తుంచుకో రామక్క.., వెయ్యరో వెయ్యరో కారుకు ఓటు..' అంటూ ప్రజాకళాకారులు ఏపూరి సోమన్న, పమ్మి రవి బృంద సభ్యులు ప్రదర్శించిన కళారూపాలు సభికులను ఆకట్టున్నాయి. ఉత్సాహపరిచాయి. కళాకారులతో పాటు సభకు హాజరైన పలువురు మహిళలు కూడా వీరి పాటలకు నృత్యాలు చేశారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఏపూరు సోమన్న బృందం ధూంధాం కార్యక్రమాన్ని ఆస్వాదించారు.

## స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



స్ట్రాంగ్ రూమ్ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వైరా టౌన్, అక్టోబర్ 27: వైరా అసెంబ్లీ నియోజకవర్గం-115(ఎస్టీ) ఈవీఎంలను భద్రపరిచిన వైరా-మధిర రోడ్డులో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లను అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శుక్రవారం పరిశీలించారు. తహసీల్దార్ కెవి.శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, శ్రీకాంత్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సైదులు పాల్గొన్నారు.

## నేడు ఖమ్మంలో బీసీల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న మేకల సుగుణారావు

రఘునాథపాలెం, అక్టోబర్ 27: ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఖమ్మం నగరం 4వ డివిజన్ పాండురంగాపురంలో నిర్వహించే బీసీల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ ఖమ్మం నగర నాలుగో డివిజన్ అధ్యక్షుడు మేకల సుగుణారావు కోరారు. డివిజన్‌లో శుక్రవారం జరిగిన బీసీ నేతల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థ పువ్వాడ అజయ్‌కుమార్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించేందుకు బీసీలందరూ కృషిచేయాలని కోరారు. బీసీలను ఐక్యం చేసేందుకు నిర్వహించే ఈ సమ్మేళనంలో అత్యధికంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు, ప్రజాప్రతినిధులు తంగెళ్లపల్లి శ్రీనివాస్, దండా జ్యోతిరెడ్డి, తొట్టి కొమరయ్య, తీగల సతీశ్‌గౌడ్, వసంతబాబు, వీరేశ్‌గౌడ్, కోలేటి బుజ్జి, మల్లేశ్, సుబ్బారావు, మాధవి, రామకృష్ణ, నరేశ్, నాగేశ్వరరావు, మేడబోయిన ఉపేందర్, నర్రా ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మదన్‌లాల్ గెలుపునకు విస్తృత ప్రచారం



వైరా రూరల్: గొల్లపూడి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు



వైరా రూరల్: మదన్‌లాల్‌ను గెలిపించాలని ప్రచారం చేస్తున్న నాయకులు

వైరా టౌన్, అక్టోబర్ 27: వైరా బీఆర్‌ఎస్ అభ్యర్థి మదన్‌లాల్‌ను గెలిపించాలని కోరుతూ నియోజకవర్గంలోని వైరా, కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడు, కారేపల్లి మండలాల్లోని అన్ని పంచాయతీల్లో పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాయి. వైరా పట్టణంలోని 20 వార్డుల్లో, ఆయా మండలాల్లోని వివిధ గ్రామాల్లో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను, నియోజకవర్గ అభివృద్ధిని, పార్టీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

వైరా రూరల్, అక్టోబర్ 27: మదన్‌లాల్‌ను గెలిపించాలని మండలంలోని గొల్లపూడి గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేశారు. మేడూరి రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పులిగొండ లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం చైర్మన్ మడుపల్లి సైదా, గొల్లపూడి అభయాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ కొత్తపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు షేక్ నాగూర్, మేడూరి శ్రీనివాసరావు, కంచర్ల నవీన్, దానియేలు, బండారు శ్రీను, జూకుంట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి, అక్టోబర్ 27: మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాటిమీదగుంపులో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. పార్టీ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సర్పంచ్ బానోత్ శంకర్, నాయకులు హన్మకొండ రమేష్, ఉన్నం వీరేందర్, అడప పుల్లారావు, ఈసం రమేష్, మల్సూర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



వైరా టౌన్: పట్టణంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు



కారేపల్లి: ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# 'ఇల్లెందు'ను అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి

### బీఆర్‌ఎస్ అభ్యర్థి హరిప్రియ



మహిళలతో కలిసి కోలాటం వేస్తున్న బానోత్ హరిప్రియ

కారేపల్లి, అక్టోబర్ 27: ''గడిచిన ఐదేళ్లలో ఇల్లెందు నియోజకవర్గాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశాను. ఈ ఎన్నికల్లోనూ నన్ను మరోసారి ఆశీర్వదించండి'' అని ప్రజలను బీఆర్‌ఎస్ ఇల్లెందు అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ అభ్యర్థించారు. కామేపల్లి మండలంలోని మద్దులపల్లి, లాల్యాతండా, జగన్నాథ తండా, బాసిత్‌నగర్, సాతానిగూడెం పంచాయతీల్లో శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్నో దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైన ఇల్లెందు నియోజకవర్గాన్ని కేవలం నాలుగేండ్లలో ఎంతగానో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. గ్రామాలన్నీ సీసీ రోడ్లతో మెరిసిపోతున్నాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో అభివృద్ధి లో ఆమడ దూరంలో ఉన్న ఇల్లెందు నియోజకవర్గాన్ని సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దానని అన్నారు. మరింత అభివృద్ధి సాధించేందుకు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలోని అంశాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు.

# సభకు వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా

**ఒకరు మృతి.. 18 మందికి గాయాలు**

**మృతురాలి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ఎమ్మెల్యే కందాళ**

కూసుమంచి రూరల్, అక్టోబర్ 27: మండలంలోని జీళ్లచెరువులో శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందగా.. 18 మంది గాయపడ్డారు. వీరిలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని గైగొళ్లపల్లి గ్రామం నుంచి 26 మందితో ఓ ట్రాక్టర్ సీఎం సభకు బయలు దేరింది. నర్సింహులగూడెం శివారు నానుతండా సమీపంలోని పల్లెప్రకృతి వనం మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి పొలాల్లో దూసుకెళ్లి బోల్తాపడింది. వెంటనే స్పందించిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు.. గాయపడిన వారిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన అల్లి అనసూయ (50) అలియాస్ కోటమ్మను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన సంగబత్తుల నర్సింహారెడ్డి, కొక్కిరేణి కృష్ణ, తురక ఎల్లమ్మ, తురక ఉప్పమ్మతోపాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురిని వైద్యం కోసం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారు ఖ మ్మం, కూసుమంచి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతురాలి అనసూయకు భర్త జా లయ్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్



### మృతురాలి కుటుంబానికి రూ.10 లక్షల సాయం

ప్రమాదంలో మృతిచెందిన అల్లి అనసూయ కుటుంబానికి పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఆమె మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి అండగా ఉంటానని, ఆమె కుమారుడికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని, ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.